


శ్రీ సౌరిస్

మా సూరమ్మ అత్తఅంటే అందరికీ హడలు. ఆవిడ అంత అందంగా వుండదు. కాని మానాన్న మాత్రం దేవతే తనకి చెల్లెలుగా పుట్టిందేమో అనుకుంటాడు. మరీ మా ముగ్గుర్నీ – నన్ను – తమ్ముణ్ణి - చెల్లిని చూస్తే ఆమెకి కోపం యెక్కువ. మా అత్తకి అందరి మీదా అధికారం చెయ్యడమంటే బలే యిష్టం. ఎప్పుడన్నా మే మల్లరిచేస్తే, మాకు తెలిసే - కావలిసే - చేశామని అనుకుంటుంది.

అసలు అత్త మొట్ట మొదట ఎండాకాలంలో మాతో వుండడానికి వొచ్చింది. అప్పు మాసత్తిస్కూలుకి వెళ్లేవాడు. కనక ఆవిడ బాధ వాడికి కొంచెం తగ్గింది. రాజుకి ఏడేళ్లు - చిట్టికి నాల్గు - నాకు తొమ్మిది.

మేము ముగ్గురం ఒకచోట కూచొని మాట్లాడుకోడం ఆడుకోడం - అత్తకి చాలా కష్టంగా వుండేది. అత్త నాన్నతో యిట్లా అనడం నేను ఒకరోజు విన్నాను. “అన్నయ్యా, మనయిల్లు పాయిఖానా గా చేస్తున్నారురా యీ పిల్లలు - నీకేమన్నా మతిపోయిందేమిటి ?” అన్నది అత్త.

“మరి పిల్లలూరుకుంటారా - ఆడుకోరూ ”

“పిల్లలూరుకో కేం చేస్తారు; నాలుగు యుద్ధిమీద తంతే సరి. నీ మెత్తతనం మూసే మరీమతి మీరారు,” అని సణుక్కుంటూ వెళ్లి పోయింది.

మేం ముగ్గురం అత్తని ఏంచెయ్యాలా అని ఆలోచిస్తూ కూచున్నాము.

“ఏం చేదాం” అన్నాడు రాజు. నాకు తెలీదు అన్నాను. ఇంతలో రాజు మళ్లీ “అత్తమనని ఎక్కడికో తీసుకెడు తుందిటగా ఇవాళ” అన్నాడు.

“సర్కసుకి తీసుకెడు తుందిట” అన్నాను.

“ఒకవేళ అత్త పెళ్లేమో” అన్నాడు రాజు.

“మామయ్య విన్నాడంటే నిన్ను తంతాడు” అన్నాను.

ఇదంతా వింటున్న చిట్టి “అత్తయ్య పెళ్లి అత్తయ్య పెళ్లి” అంటో వొంటింటో అన్నం వొండుతున్న అత్తయ్య దగ్గిరికి వెళ్లి “అత్తయ్యా, నీకు పెళ్లి, అన్నయ్య చెప్పాలు” అంది. “అన్నీ పాడు మాటలూ నవ్వా, పాడుదానా ఎక్కడ దాపరించావే నాకు” అని అరిచింది.

"నువ్వే పారుదానివి. ఎందుకు నన్ను తిత్తావు. బుద్ది లేదు" అచిట్టి ఒక వుర్లగడ్డ వుంటే, దాన్ని అత్తమీదికి విసిరేసింది.

"అత్తతో వెళ్లాలని లేదు. అంత సర్కసూ పాడు చేస్తుంది," అన్నాడు రాజు.

"నాన్న తీసి కెడతానన్నాడు. నాన్న వొస్తే బావుండును కదూ" అన్నాను.

రాజుతల వూపి "నాన్న ఇవాళ కాదుట, ఎప్పుడన్నా తీసికెడతాట్ట" అన్నాడు.

ఇంతలోనే పెడేలు పెడేలు మని మావీపుల మీద నాలుగు దెబ్బలు పడ్డాయి. ఏమిట్రా అని తిరిగిచూసే టప్పటికి అత్త కోపంతో మాకేసి వురిమి చూసి "అవును. మీరు నాకు పెళ్లిచెయ్యి లేదనే అనుకుంటున్నాను" అని వెళ్లిపోయింది. ఆశ్చర్యంతో అర్థంగాక మేము మొహాలు చూసుకున్నాము.

"కాస్త పెళ్లిఅనే టప్పటికే అంత కోపం ఎందుకో! మహా తను పెళ్లే ఎరగనట్టు" అన్నాడు రాజు.

"రాజూ ఇవాళ సర్కస్‌కి అంత మంచిరోజు కాదన్న మాట. ఏడేరా కూలి మీద పడడమో లేకపోతే పులి గొలుసులు తెంపుకు మీద పడడమో జరగక మానదు" అని నేను అన్నాను.

ఇట్లా మాట్లాడుకుంటూ వుంటే అత్తవొచ్చి "దబ్బున బట్టలేసుకుని సిద్ధంగా వుండండి" అంది.

నాన్న యింటో లేడు. అదిచూసి ఇంకా అధికారం చెయ్యడం మొదలు పెట్టింది. అయిదింటికే అన్నం పెట్టింది. మాలో ఎవరన్నా బండీయెక్కే సమయానికి అక్కడ వుండక పోతే వొదలి పెట్టి పోవడమే: తరవాత యేడిస్తే లాభంలేదని చెప్పింది.

ఇంతకీ దురదృష్టం రాజుది. సర్కస్ సంగతి మరిచి పోయినాడో - ఎందువల్లనో చేతులో కథల పుస్తకం పట్టుకుని ఎక్కడికో పోయినాడు. నేను చెబుతున్నా వినిపించుకో లేదు. వాడేదో బావు కో పోతున్నాడనుకుంటున్నట్లు యింటో కుక్కలు కూడా వాడివెంట పోయినాయి.

అయిదున్నర అయింది. మాబగ్గీకోసం కూచున్నాం. దాసీదిరాజుకోసం వెతుకుతా నన్నది. అత్త "అక్కర్లేద"ంది.

"కాదండి. ఎక్కడో చదువుతో కూచుంటారు — అబ్బాయిగారు. ఆఖరికి అన్నంకూడా మరిచిపోతారు. ఎప్పుడూ యిట్లానే వెతికి పిలుచుకోస్తాము," అంది దాసీది.

"వెతక నక్కర్లేదు. మరీ అంత మరుపయితే ఎట్లా? ఒక్కసారి శాస్తి అయితే బుద్ధి వొస్తుంది."

"అమ్మగారూ, అబ్బాయిగారు మతి మరుపు వారండీ. తెలిసి చెయ్యటం లేదండీ. మరిచి పోయారండి, మీరు వొదిలి వెడితే మరిచి నిద్రపోతారండి."

"అదంతా నాకు తెలీదు. వాడు అందరి మల్లేసమయానికి వుండడము నేర్చుకోవాలి. చిట్టి అమ్మాయిగారికి బట్టలు వెయ్యి."

ఇంతలో చిట్టి మెట్లమీద నుంచి కిందపడి యేడ్చింది. అత్త కెందుకో దయపుట్టి కలకండ ముక్క యిచ్చింది. నేను మెల్లిగా రాజును వెతకడానికి వెళ్లితూ వుంటే అత్త వొచ్చి నాచేతులు పట్టుకుని లాక్కెళ్లి కూచో పెట్టింది.

బగ్గీ వొచ్చింది. కాని రాజు రాలేదు. చిట్టి అత్త చెయ్యి పట్టుకుని మెలిగా బగ్గీదగ్గిరి కొచ్చింది. అందరమూ బండీ యెక్కాము. నేనూ మామయ్యా వెనకాల కూచున్నాం. అత్తా చిట్టీ ముందర కూచున్నారు. మేం అందరం ఎక్కామో లేదో చూసి చిట్టి "లాజు ఏడి?" అంది.

"రాజుకి పొగరెక్కి మనం ఏమంటామో అని దాక్కున్నాడు. వాడు లేకుండానే మనం సర్కస్కి వెళ్లాలి."

"ఎల్లటానికి యీల్లేదు. చీలాములూ, బందీఆపు — లాజుకి మలెందుకు చెప్పలేదు? చలకచ్చుకి ఎల్ల వొద్దు," అని అరుస్తోంది చిట్టి.

శ్రీరాములు చిట్టిమాటలు లెక్క చెయ్యక బండీ తోలుతున్నాడు.

మేం వెళ్లకముందే ఆట మొదలు పెట్టారు. ఇంగ్లీషు బాండు బాగా వాయిస్తున్నారు. దర్జాగావుంది. మేము ఆడవాళ్లలో కూచున్నాం. సర్కసు బాగా కనపడడం లేదు. ఆరు గుఱ్ఱాల మీద ఆరు కోతులెక్కి వొచ్చాయి. ఏమిటో తమాషాలు చేశాయి. చిట్టికి సరిగ్గా కనిపించక గిజ గిజ లాడుతోంది. అత్తని మాస్తే దానికి భయమూ - కోపమూనూ.

మాస్తూ - మాస్తూ "నాన్నదగ్గిల కూచున్నాడు లాజు" అంది చిట్టి. ముందరిగా వుండే పరుపుల కుర్చీల మీద నాన్నా రాజూ కూచుని ఏదో పొట్లాంలలోవి తింటు న్నారు. ఇంతలో ఒక బఫూన్ వచ్చి, రాజు తలమీద కొట్టి ముద్దు పెట్టుకున్నాడు. రాజు నవ్వినట్టు కనిపించింది. మాకూ అక్కడికి వెళ్లి నాన్నతో కూచోవా లనిపించింది. నాన్న దగ్గిరికి వెడతానని ఏడ్చింది చిట్టి, కాని అత్త కోప్పపడే టప్పటికి వూరుకుంది. మధ్య యింటరువల్లో వాళ్లిద్దరూ లేచి వెళ్లారు. రాజు మాదగ్గిరికి వస్తున్నాడేమో ననుకున్నాను. ఇట్లా చూసేటప్పటికి గుఱ్ఱం మీద ఫీటుచేసిన ఆయనతో రాజు మాట్లాడుతున్నాడు. నాన్న అక్కడే వాళ్లమాటలు వింటూ నవ్వు మొఖంతో నిలుచున్నాడు. ఇంటరువల్ కాగానే యిద్దరూ వచ్చి మళ్లీ పరుపుల కుర్చీలలో కూచున్నారు. తినడానికి మళ్లీ రాజు పొట్లము తెచ్చుకున్నాడు. నా నోరు వూరిచచ్చాను.

సర్కసు అయిపోయింది. డాన్సు చేసిన పిల్ల లిద్దరితోనూ నాన్న ఏదో మాట్లాడుతున్నాడు. రాజు చెయ్యి పట్టుకొని వాళ్ల డ్రస్సులూ అవీ చూపించారు. నేనూ చిట్టీ నాన్నదగ్గిరికి వెళ్తామంటే అత్త తిట్టి కొట్టబోయింది. చిట్టి ఏడ్చింది. నేను వూరుకున్నాను.

బయటికి వచ్చాం - నాన్నా రాజూ కనపళ్లేదు. మే మింటికి చేరుకున్నాము. నాన్న రాజు యింటికి రాలేదు. కాస్సేపటికి నాన్న ఏదో కథ రాజుకి చెపుతూ యింటికి వచ్చారు.

రాజుని తీసుకొచ్చినందుకు నాన్నని అత్త బాగా తిట్టింది.

నేను నాన్నని - "రాజును ఎప్పుడు తీసుకొచ్చావు నాన్నా" అని అడిగాను.

నాన్న యింటికి వొచ్చాడుట. ఎక్కడనించో ఏడుపు వినపడ్డదిట, ఎక్కడా అని నాన్న చూసేటప్పటికి మాసిపోయిన చొక్కా, లాగూ, బుగ్గలమీద మసితో తోట ముందర ఏడుస్తో రాజు నుంచుని వున్నాడుట. రెండు కుక్కలూ వాణ్ణి వోదారుస్తున్నట్టు తోకలాడిస్తూ నుంచుని వున్నాయి.

"ఎందుకు ఏడుస్తున్నావు రాజూ" అన్నాడు నాన్న.

"వాళ్లు నేను లేకుండా సర్కసికి వెళ్లారు. నాతో చెప్పనేలేదు నాన్నా" అన్నాడు రాజు ఏడుస్తో.

"లే, ఏడవకు మరి. నాతో చెప్పు సంగతి అంతా. మరి వాళ్లతో సరిగ్గా వెళ్లేవేళకి ఎందుకు వుండలేదు."

"నేను మరిచి పోయాను. దబ్బున అన్నం పెట్టడం ఎందుకు? మామూలు వేళే అనుకున్నాను - నేను చూసేప్పటికి బండీమీద యెక్కి హాయిగా నవ్వుకుంటూ పోతున్నారు.

"వాళ్లు పిలిచే వుంటారు. నువ్వు వినిపించుకో లేదు. అంతే"

"కాదు. వాళ్లెప్పుడూ పిలుస్తారు. ఇవాళ పిలవలా"

"సర్కస్ మీద అంతయిష్టం వున్న వాడివి ఎందుకు టయింకి అందరితో వుండలేదూ?"

"నేను చెపుతున్నాగా మరిచి పోయినానని"

"సరే మనిద్దరం వెడదామా ఏమిటి?"

ఇద్దరూ బండీయెక్కి సర్కస్‌కి వచ్చారు. రాజుకి పాడుగుడ్డలున్నాయో, మంచి గుడ్డలు వున్నాయో అదంతా చూడలేదు. ఇద్దరూ సర్కసు లోపలికి వచ్చారు.........

నేను కూడా రాజుతో యింటిదగ్గిరే దాక్కుని నాన్నతో వెళ్లినట్టయితే ఎంతో బాగుండేది అనుకున్నాను.